విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 30, మే 2025

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కండి : ముప్పాళ్ల

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు సాధించేలా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. జిల్లా కౌన్సిల్ సమావేశం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో ముందు గా పహల్గాం ఉగ్ర దాడిలో చనిపోయిన 27 మంది పౌరులు, వీర జవాన్ మురళి నాయక్‌కు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటిం చారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడుతూ దేశంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీల్లో రెండోది సీపీఐ అని, రానున్న రోజుల్లో జరగబోయే సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించెందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తల బలిదానాల ఫలితమే నేటి ప్రజల స్వేచ్ఛ అని అన్నారు. దేశంలో నక్సలిజం, మావోయిస్టులు 2026 మార్చి నాటికి ఉండకూడదనే ఉద్దేశంతో నరేంద్ర మోడీ, అమిత్ షా ప్రవర్తిస్తున్నారని, మరి త్రిపుర, మేఘాలయల రాష్ట్రాల్లో జరుగుతున్న తిరుగుబాట్లు ఏంటని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి ఏడాది గడుస్తున్నా ఎన్నికల హామీల అమలు ఎక్కడ అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజ నేయులు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకున్న తర్వాత చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌లను చూసుకుంటూ దేశంలో నిరంకుశత్వ పాలన సాగిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేయమని నరేంద్ర మోడీకి విన్నవించు కున్నా ఆర్‌ఎస్‌ఎస్ మాటలు విని, నరేంద్ర మోడీ పట్టించుకో లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీల అమలులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు నివాసయోగ్యమైన స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఇస్తానన్న ఎన్నికల హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కే. ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు, జిల్లా సమితి సభ్యులు నాగరాముడు, సంజీవులు, సుబ్బారెడ్డి, సామెల్, హరినాథ్, డి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వై భార్గవ్, బాలకృష్ణ, ప్రతాప్, జిలాని బాష, ఆళ్లగడ్డ తాలూకా కార్యదర్శి కె.భాస్కర్, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రజిత, జి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం.. దెబ్బతిన్న మినుము

విశాలాంధ్ర - రుద్రవరం: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మినుము పంట పూర్తిగా దెబ్బతిన్న సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి. మండల పరిధిలోని శ్రీ రంగాపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే రైతు ఏడు ఎకరాల విస్తీర్ణంలో మినుము పంటను సాగు చేశారు. కోత దశకు చేరడంతో రెండు ఎకరాల మినుము పంటను కోసే లోపు ఆగకుండా వర్షం కురవడంతో కోసిన మినుము, మిగిలిపోయిన ఐదు ఎకరాల మినుము పంట పూర్తిగా తడిసి ముద్దయింది. గురువారం విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సుమతి సిబ్బందితో గ్రామానికి చేరుకుని పంటను పరిశీలించారు. వర్షానికి మినుము పంట దెబ్బతినడంతో నష్టాన్ని నివేదికలుగా తయారుచేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారని రైతులు తెలిపారు.

జీతాలు పెంచాలంటూ కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - డోన్ రూరల్: డోన్ మున్సిపాలిటీలో పనిచేయుచున్న ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు జీతాలు పెంచాలని మున్సిపాలిటీ కార్యాలయం నందు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు అన్వర్ అబ్బాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలో పనిచేయుచున్న ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలు కొనసాగిస్తున్నారని ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కార్మికుల సమస్యలను నెరవేరేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు . డోన్ మున్సిపల్ మేనేజర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక వినతిపత్రం సమర్పించారు. కార్మికుల డిమాండ్‌లు టెక్నికల్ కార్మికులకు రూ.29,200 జీతాలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ కార్మికులకు 24,500 రూపాయల జీతాలు ఇవ్వాలని, 15 ఏళ్లకు పైబడిన కార్మికులకు రెగ్యులర్ చేయాలని 55 ఆదివారములు 17 దేశ జాతీయ రాష్ట్ర పండగల 72 రోజులు సెలవులు ప్రకటించాలని లేదా వేతన విధానాలైన ప్రకటించాలని తెలిపారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికునికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హరి, నాయకులు సంజీవుడు, అజయ్, గౌస్, చంద్ర తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రుతుపవనాలు రాకతో మోస్తారు వర్షం

విశాలాంధ -బనగానపల్లె: నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యాప్తంగా విస్తరించడంతో బనగానపల్లె పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి చిరుజల్లు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు తమతమ నివా సాలకు పరిమితమయ్యారు. అన్నదాతలు రుతుపవనాలు ముందుగానే చేరుకోవడం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యం యోగ వల్ల సాధ్యం

విశాలాంధ్ర - శిరివెళ్ల : ప్రతి వ్యక్తి జీవితంలో యోగా ఒక భాగం కావాలని సంపూర్ణ ఆరోగ్యం యోగా వల్ల సాధ్యం అవుతుందని ఎంపీడీవో సి.శివమల్లేశ్వరప్ప అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం భవనంలో గత రెండు రోజులుగా జరుగుతున్న యోగా శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని పలు రకాల యోగా మెలకువలను తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా సాధన మనసుకు,శరీరానికి మధ్య ఐక్యతను ఏర్పరుస్తుం దన్నారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఎలా గడపాలో యోగా నిర్దేశిస్తుందని, ఇటీవల కాలంలో చేపట్టిన పలు వైద్య అధ్యయనాలు యోగ సాధన వల్ల మనసుకు, శరీరానికి కలిగే ప్రయోజనాలను ప్రత్యేకంగా ప్రస్తావించాయని ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప వివరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించారని మోడీ పిలుపును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తిగా తీసుకొని యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ ధనుంజయ పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటి సరఫరాకు కృషి

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల కేంద్రం లోని ప్రజలందరికీ సురక్షితమైన నీటి సరఫరా అందించేందుకు శిరివెళ్ల మేజర్ గ్రామ పంచా యతీ కృషి చేస్తున్నదని ఈవో అశ్వినీ కుమార్ తెలియజేశారు. మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, ఈఓపిఆర్డి శ్రీనివాసుల శర్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితర అధికారుల ఆధ్వర్యంలో గురువారం నీటి పరీక్షలు నిర్వహించినట్లు ఈవో అశ్విని కుమార్ తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రస్తుత భూగర్భ జలాలు కలుషితమై గ్రామంలోని నీటి సరఫరా నాణ్యత ప్రమాణాలు తగ్గే అవకాశం ఉన్నందున నీటి పరీక్షలు చేశామని అన్నారు. పలు ఏరియాలలో నీటి పరీక్షలు నిర్వహించగా స్వచ్ఛతకు నాణ్యతకు నిలువుటద్దంగా పరీక్షలు వెలువడ్డాయని ఈవో తెలియ జేశారు. క్రమం తప్పకుండా ఆధునిక క్లోరినేషన్ చేపడుతున్నామని ఈ నేపథ్యంలోనే గ్రామంలో స్వచ్ఛమైన నీరు సరఫరా అవుతున్నదని ఈవో అశ్విని కుమార్ వివరించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం.. పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంటి కోట మస్జిద్ ప్రాంగణంలో జనాబ్ ముహమ్మద్ రఫీఖ్, కన్వీనర్, వక్ఫ్ రక్షణ, రాజ్యాంగ రక్షణ క్యాంపెయిన్ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆ.ప్ర, ముఖ్య అతిథిగా హాజరై వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబ్దుల్ సమద్ అధ్యక్షతన మొహమ్మద్ రఫీక్, జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, గౌరవాధ్యక్షులు ఎస్.ఎండి అబులైస్, ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు ఇమ్రాన్ పాషా, కో-కన్వీనర్ మస్తాన్, కోశాధికారి ఎస్పీ బాష, ఆయిట జిల్లా అధ్యక్షులు షోయబుజ్జమన్ లు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రఫీక్ మాట్లాడుతూ నేడు మతతత్వ వాదులు వక్ఫ్ చట్టం గురించి జన బాహుళ్యంలో ముస్లింలలోనూ, ముస్లిమేతరులలోను, తీవ్ర అపోహలు, అనుమానాలు కలిగేలా ప్రచారం చేశారని, వాటిని నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని,అపోహలను పటాపంచలు చేయడానికి ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడు తుందని, ఈ పుస్తకాన్ని తప్పక చదివి అపోహలను దూరం చేసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టులో అనేక సంస్థలు వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేయడం జరిగిందని, సుప్రీంకోర్టు 40 కోట్ల మంది ముస్లింల మనోభావాలను పరిగణలోకి తీసుకుని బాబ్రీ మసీదు విషయంలో ఎలా అయితే హిందువుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని తీర్పు ఇచ్చిందో, అలా వక్ఫ్ సవరణ చట్టం విషయంలో తీర్పు ఇవ్వాలని, కేంద్రం వ్యవసాయ చట్టాలను ఏ విధంగా వెనక్కి తీసుకున్నదో అలా వక్ఫ్ సవరణ చట్టాన్ని కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులను కాపాడడం ప్రతి ఒక్క ముస్లిం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ ఇస్లామి మోమిన్ గౌస్, ఖిద్మత్ ఫయాజ్, ఆల్ మేవా జిల్లా అధ్యక్షులు సలీం, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షులు ఉస్మాన్ బాష, వెల్ఫేర్ పార్టీ అలీమ్, ఎస్డిపిఐ ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెకి ఒప్పందాలను రద్దు చేయాలి : పెనుమల్లి మధు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: చంద్రబాబు, లోకేష్ మాటలు ప్రజలను మోసం చేసేవిలా ఉన్నాయని, సెకి ఒప్పందాలను రద్దు చేయాలనీ సీపీఐ(ఎం) రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు అన్నారు. గురువారం నంద్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ చేసుకున్న సెకి ఒప్పందాన్ని రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు మాట మార్చారని, ఒప్పందాన్ని 20 ఏళ్ల పాటు కొనసాగిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే రాబోయే కాలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం చూపలేదన్నారు. 1.20 పైసలుకు ఇచ్చే విద్యుత్‌ను రూ.4.60లకు కొనాలని చెప్పడం చూస్తే ఆదానికి దోచి పెట్టడానికేనని మధు ఆరోపించారు. ప్రధాని మోడీని పొగడటానికే మహానాడును పెట్టుకున్నట్లు ఉందని, పాకిస్థాన్ పై చేసిన యుద్ధంలో మనం సాధించిందేమి లేదన్నారు. గత నెలలో రాష్టానికి వచ్చిన మోడీ రాష్టానికి ఏమి ఇవ్వలేదని ఆరోపించారు.

ఉగ్రవాదులను పట్టుకోవడంలో మోదీ ప్రభుత్వం వైఫల్యం : పహాల్గంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకోవడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు ఆరోపించారు. ట్రంప్ వ్యాపార టారీఫ్‌కు తలొగ్గి కాల్పుల విరమణ చేశారని ట్రంప్ కు మోడీ దాసోహం అంటున్నాడని ఆయన మోడీపై విమర్శలు కురిపించారు. ఆపరేషన్ సింధూర్‌కు యావత్ దేశ ప్రజలు మద్దత్తు తెలిపితే మోడీ మాత్రం అమెరికాకు తల్లొగ్గాడని యుద్ధంలో ఏమి సాధించలేక పోయారని ఆయన అన్నారు. మన దేశం అంతరంగిక విషయాల్లో ట్రంప్ జోక్యాన్ని నిలువరించడంలో మోడీ విఫలం అయ్యారన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, ఎ.నాగరాజు, టి.రామచంద్రుడు, పుల్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు

విశాలాంధ్ర - నందికొట్కూరు: రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ సలహాలు పాటించి లాభాలు పొందాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగ ఆద్వర్యం లో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ద్వార వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నందికొట్కూరు మండలంలోని అల్లూరు, శాతనకోట మరియు మల్యాల గ్రామాల్లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. అదేవిధంగా కేవీకే శాస్త్రవెత్తలు బాలరాజు, రవి గౌడ్ మాట్లాడుతూ ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలపై రైతులకు సలహాలు సూచనలు సూచించడం జరిగింది. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన ఎరువుల మొతాదును వివరించారు. మొక్కజొన్న, కంది, వరి, సోయబీన్, పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్ళు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్షా వలి, డిఆర్‌సి నుండి హేమలత, ఉద్యాన అధికారి తేజస్విని, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓ మోస్తారు వర్షం..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండ లంలోని ఆయా గ్రామాలలో గురు వారం మోస్తారు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురవడంతో వాతా వరణం ఒక్కసారిగా చల్లగా మారింది. మండలంలోని అంకిరెడ్డిపల్లి, బందార్ల పల్లి, మదనంతపురం, తుమ్మలపెంట, చింతలాయపల్లి, అబ్దుల్లాపురం, కోరు మానుపల్లి, ఉమ్మాయిపల్లి తదితర గ్రామాలలో వర్షం కురిసింది. గత నాలుగు ఐదు రోజులుగా అడపా, దడపా కురుస్తున్న మోస్తరు వర్షాలతో వాతావరణం పూర్తిగా మారి పోయింది. భూగర్భ జలాలు పెరిగేంత వర్షాలు కురవనప్పటికీ, మోస్తారు వర్షాలతో భూమి పచ్చదనంతో కనబడుతోంది.

చౌక దుకాణాల వద్దనే ప్రతి నెల రేషన్

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల తహశీల్దార్ కార్యాలయం నందు గురువారం తహశీల్దార్ రత్న రాధిక ఆధ్వర్యం లో చౌక దుకాణ ల డీలర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం నందు డీలర్లకు ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం జూన్ 1వ తేదీ నుండి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందించుటకు గురువారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా జూన్ ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రజలకు ఎలాంటి అవంతరాలు లేకుండా సరుకులు ఇవ్వాలన్నారు. సరుకులు విషయమై గ్రామాల్లో దండోరా వేయించాలని సంబంధిత రెవెన్యూ అధికారులు ఆదేశించారు.

ఉమామహేశ్వరులను దర్శించుకున్న పలువురు

విశాలాంధ్ర - బన గానపల్లె: మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమామహే శ్వర స్వామిని గురువారం డిప్యూటీ కలెక్టర్, శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు డిప్యూటీ కలెక్టర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉర్దూ బోధన వేదన

ఉనికిని కోల్పోతున్న ఉర్దూ పాఠశాలలు

పట్టణంలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

ఓబులంపల్లి ఉర్దూ ప్రాథమిక పాఠశాల

కోటకందుకూరులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఉర్దూ పాఠశాలల్లో దాదాపు వంద శాతం ముస్లిం విద్యార్థులే చదువుతుంటారు. ముస్లిం మైనార్టీ జనాభా అధికంగా ఉన్న తాలూకాలో ఆళ్లగడ్డ ఒకటి. ఆళ్లగడ్డ తాలూకాలో ఉర్దూ విద్యకు గడ్డు రోజులు కొనసాగుతున్నాయి. ఆళ్లగడ్డ తాలూకాలో ఉర్దూ మాధ్య మంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీ డియట్ చదవాలంటే నంద్యాల లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. నియోజకవర్గంలో ఎక్కడ కూడా ఉర్దూ మాధ్యమ కళాశాల లేకపోవడం గమనార్హం. గత్యంతరం లేక పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు కొందరు అక్కడితోనే చదువుల్ని ఆపేస్తుండగా, మరి కొందరు ఇతర ప్రాంతాల్లోని ఉర్దూ మాధ్యమ కళా శాలలకు వెళ్తున్నారు. తాలూకాలో మైనార్టీల జనాభా దాదాపు 80 వేలు ఉంది. ఇంతటి భారీ స్థాయిలో మైనా ర్టీలు ఉన్న ఉర్దూ మాధ్య మంపై ప్రభుత్వం దృష్టి సారిం చడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆళ్లగడ్డ మండలంలో మూడు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల ఉన్నాయి. పట్టణం లో 15 వేలకు పైగా ముస్లిం జనాభా ఉన్న కేవలం రెండు ఉర్దూ పాఠశాలలే ఉన్నాయి. ఆళ్లగడ్డ పట్టణంలో ప్రాథమి కోన్నత పాఠశాల, ఒక ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల ఉంది. కోట కందుకూరు, ఓబులంపల్లెలో ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. పట్టణంలోని పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 72 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందరికీ కలిపి కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్క గదిలో రెండు తరగతులను నిర్వహించి మిగిలిన వారిని వరండాలో కూర్చోబెట్టి బోధిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు, పందులు ఆవరణలోనే తిరుగు తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారు. ఉర్దూ పాఠశాల 8వ తరగతి వరకు ఉండగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అని రాయాల్సి ఉండగా మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాల పేరు ఇప్పటికీ ఉండడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యానికి ఒక నిద ర్శనం. పట్టణంలోని మగ్దుమ్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశా లలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కాగా పట్టణం లో 8వ తరగతి వరకే ఉర్దూ పాఠశాల ఉండ డంతో తొమ్మిది, పదో తరగతి చదవడానికి కొంతమంది విద్యార్థులు సిరివెళ్ల, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. మరికొందరు గత్యంతరం లేక పాఠశాలను మాన్పించేసి కూలి పనులకు పంపిస్తున్నారు. పట్టణంలో ఉన్న ప్రాథమి కోన్నత పాఠశా లను ఉన్నత పాఠశాల గా మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో 60 శాతం ముస్లిం జనాభా ఉన్నప్పటికీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులే ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యా యులు విద్యార్థుల సంఖ్య పెంపునకు దృష్టి సారించకపోవడం, దీనికి తోడు పాఠశాల పరిసరాలను సవ్యంగా ఉంచ డంపై దృష్టి సారించకపోవడంతో ఏడాది కేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. గతంలో ఇద్దరు ఉపా ధ్యాయులు ఉండగా ప్రస్తుతం కేవలం ఒక్కరే బోధిస్తున్నారు. ఉపాధ్యా యురాలు, మండల విద్యా శాఖాధి కారి, గ్రామ పెద్దలు పాఠశాలపై దృష్టి సారించి విద్యార్థినిలను పాఠశాలలో చేర్పిం చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆళ్లగడ్డ మండలం కోట కందు కూరులోని ఉర్దూ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో దాని పక్కనే అదనపు గది నిర్మించారు. పాత పాఠశాలలోని రెండు గదుల్లోనే తరగతులను బోధిస్తున్నారు. కొత్త ఆదనపు తరగతి గదిలో ఒక గదిలో విద్యార్థులను బోధి స్తుండగా, మరొక గదిలో ఇటుకలు, సిమెంట్ బస్తాలు, ఇతర సామాన్లు పెట్టారు. ఈ పాఠశాలకు ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారు. చాగలమర్రి మండల కేంద్రంలో ప్రాథమి కోన్నత, ప్రాథమిక ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద వంగలి గ్రామంలో ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయకుండా అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠ శాలలో ఒక ఉర్దూ పోస్టు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. సిరివెళ్ల మండల కేంద్రంలో ఉర్దూ బాలుర, బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఒక ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల ఉంది. మండలంలోని యర్ర గుంట్ల, బోయల కుంట్లలో ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. మైనార్టీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రధాన మంత్రి జన వికాస్ కార్యక్రమం కింద మైనార్టీలు ఎక్కువగా ఉన్న ఆరు మండ లాలకు నిధులు కేటాయించగా అందు లో రెండు మండలాలైన చాగల మర్రి, శిరివెళ్ల మండలాలు ఆళ్లగడ్డ నియోజక వర్గం లోనే ఉన్నాయి. చాగలమర్రి మండలం పెద్ద వంగలి గ్రామంలో చేపట్టిన ఐటీఐ కళా శాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆళ్లగడ్డ పట్టణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను అప్గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలగా మార్చాలి. నియోజకవర్గంలో ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉర్దూ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి: రాష్ట్ర ప్రభుత్వం నియో జకవర్గంలోని ఉర్దూ పాఠశాలల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర సభ్యులు ముల్లా నిజాముద్దీన్ అన్నారు. నియోజక వర్గంలో ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో 8వ తరగతి వరకు ప్రాథమికోన్నత పాఠశాల ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి పదో తరగతి వరకు అదనపు గదులను నిర్మించాలన్నారు. నియో జకవర్గంలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చేయాలన్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం: పట్టణం లోని పాత మసీదు సమీపంలో ఉర్దూ ప్రాథమి కోన్నత పాఠశాల ఉందని 9,10 తరగతులు నడపడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఎంఈఓ శోభా వివేకావతి తెలిపారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న ఓబులంపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారని, విద్యార్థులను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ రెండో తేదీన మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నా కార్యక్రమం గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అన్ని మండల కేంద్రాలలో జూన్ రెండో తేదీన జరిగే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు
అవస్థలు ఎన్నెన్నో

విశాలాంధ్ర - కర్నూలు : ఆధార్ కార్డులో తప్పుగా పడిన పుట్టిన తేదీని, పేర్లను సరి చేసుకోవాలంటే పడే తిప్పలు అన్నీ, ఇన్నీ కావు. వారి తిప్పలు వర్ణణాతీతం. ఆధార్ కార్డులో మొదట్లో నమోదు చేసినప్పుడే దొర్లిన తప్పులు ఎన్నో.. కోకొల్లలు అని చెప్పొచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలు ఆధార్ కార్డును నమోదు చేయించేటప్పుడు వారికి సరైన అవగాహన లేకపోవడంతో చాలా వరకు తప్పులు దొర్లుతుంటాయి. ఓ వ్యక్తి ఆధార్‌లో తప్పుగా పడిన తన పేరును, లేదా వయస్సును మార్చుకోవాలంటే ప్రమాణీకంగా పదో తరగతి మార్కుల జాబితాను తీసుకుంటారు. మరి చదువుకోని వారి పరిస్థితేంటి.. ఒక వేళ పదో తరగతి చదివి ఉంటే 1995 ముందు మార్కుల లిస్టులో సంబంధిత వ్యక్తి ఫోటో ఉండేది కాదు. ప్రస్తుతం వారు తమ ఆదార్‌కార్డులో తప్పుగా పడిన పుట్టిన రోజును, లేదా పుట్టిన తేదీని మార్పు చేసుకోవాలంటే పదో తరగతి మార్కుల లిస్టు ఆదారంగా అందులో ఉన్న ఫోటోతో సరిచూసి ఆదార్ కేంద్రం వారు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. మార్కుల జాబితాపై కచ్చితంగా ఫోటో ఉండాలని, లేకపోతే మేమేమి చేయలేమంటూ ఆధార్ సెంటర్ వారు సూచిస్తున్నారు. దీంతో 1995 కంటే ముందు పదో తరగతి అభ్యసించిన వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వారు ఆదార్‌కార్డులో పుట్టన తేదీని మార్పు చేసుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువుకునే వారిని ఇటీవల ఆపార్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. అందులో ప్రతి విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లతో సహా ప్రతి ఒక్కటి సరియైన విధంగా ఉంటేనే నమోదు ఆపార్‌లో నమోదు అవుతుంది. లేకపోతే ఆపార్‌లో వారి నమోదును తిరస్కరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువురాని తల్లిదండ్రులు ఏదో వారికి గుర్తున్న విధంగా వయస్సు, పేర్లను చెప్పి పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తీరా పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లో ఓ విధంగా, తల్లిదండ్రుల ఆధార్ కార్డులో ఇంటి పేరు మరో విధంగా ఉంటుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆధార్‌లలో ఒకే విధంగా సరియైన రీతిలో మార్చుకునేందుకు చదువురాని తల్లిదండ్రులు పడ్డ కష్టాలు వర్ణణాతీతం. దీనిపై అధికారులు దృష్టిసారించి

ధర్నాను జయప్రదం చేయండి- సీపీఐ

విశాలాంధ్ర - నందవరం: గ్రామాల్లో రెండు సెంట్లు, పట్టణాలలో మూడు సెంట్లు ఇండ్ల స్థలాలు లేనివారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2న మండల కార్యాలయాల దగ్గర సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్యలు కోరారు. గురువారం వారు గోడ పత్రికలను విడుదల చేసి, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలి వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరాజ్, మల్లేష్, నబి సాబ్, చెన్నప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు అన్నారు. గురువారం ఖానా ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, కోచ్లు అక్షర, మునిస్వామి, జిల్లా యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్‌లు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బి.హైమావతి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కోడు మూరు నియోజకవర్గంలోని కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బొగ్గుల హైమావతి నియమి తుల య్యారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు నూత నంగా ఎన్నికైన హైమావతికి మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, అనంత రత్నం మాదిగ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లా డుతూ ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నన్ను మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించినందుకు అధిష్ఠానం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియశారు. పార్టీ బలోపేతానికి అందర్నీ కలుపుకొని కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్, మహిళా కాంగ్రెస్ ఎ.లలితమ్మ, సి.స్వప్న ఎస్ సలోమి, సి.మాణిక్యమ్మ, రాజేశ్వరి, మల్లికా దివ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర- ఆదోని : పట్టణ రైల్వే ట్రాక్ పక్కనగల శ్రీ సాయి నగర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, జిల్లా సమితి సభ్యులు వీరేష్, పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ విద్యుత్ తీగల ఏర్పాటు చేయ కుండా కాలనీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రమాదాల గురైతే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి బసాపురం గోపాల్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ గౌడ్, పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, విజయ్, బేల్దర్ రాముడు, రమేష్ కుమార్, సిపిఐ నాయకులు నరసింహులు కిరణ్, జయమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

కార్డుదారులకు ఇబ్బందులు రానివ్వొద్దు

విశాలాంధ్ర - నందవరం: రేషన్ డీలర్లు కార్డుదారులకు ఇబ్బంది రానివ్వదని తహశీల్దార్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లకు జూన్ నెలకు సంబంధించి కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ విషయంలో ఇబ్బందులు రాకుండా చేసుకోవాలని, రేషన్ షాపులో సదుపాయాలపై డీలర్ లకు కీలక సూచనలు చేశారు. ప్రతి డీలర్ ఉదయం 8 నుండి 12 వరకు, సాయంత్రం 4 నుండి 8 వరకు కచ్చితంగా రేషన్ షాపును డీలర్లు తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులకు కచ్చితంగా ఇంటి వద్దకే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటీలు శశిధర్, మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు దక్కేవరకూ పోరాటం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అన్నారు. జూన్ రెండో తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను స్థానిక సీపీఐ కార్యాలయం నందు విడుదల చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్, మండల సహాయ కార్యదర్శి రాజీవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలనూ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వాణి ,ఈరమ్మ, చామంతి, సిపిఐ నాయకులు కేసీ జబ్బర్, దాదావలి, మల్లికార్జున గౌడ్, వీరేష్, విజయేంద్ర, నాగరాజు, నరసింహులు, సుంకన్న, కృష్ణ, అజార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ గట్టుపై ప్రభుత్వ భూములను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జగన్నాథ గట్టుపై ఉన్న ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. గురువారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన ప్రభుత్వ భూములను, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జగన్నాథ గట్టు వద్ద టిడ్కో గృహాలకు, క్లస్టర్ యూనివర్సిటీకి, ఐఐటీడీఎంకు, ఇతర సంస్థల కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. మ్యాపుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన భూములకు సంబంధించి సమగ్రమైన వివరాలతో నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆర్డీవో, తహశీల్దార్లను ఆదేశించారు. సిల్వర్ జూబ్లీ క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి నిర్మాణ పనులకు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈఈ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, మరొక సారి డిఓ లెటర్ సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సిల్వర్ జూబ్లీ క్లస్టర్ ఈఈ ను ఆదేశించారు. అనంతరం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు పైన ఉన్న రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం, దర్గాలను కలెక్టర్ దర్శించుకొన్నారు. ఇలాంటి టూరిస్ట్ ప్రదేశాలను ప్రజలకు తెలియచేసే విధంగా పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ ను ఆదేశించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, కల్లూరు తహశీల్దార్ రామాంజ నేయులు, కర్నూలు మండల తహశీల్దార్ రమేష్, క్లస్టర్ యూనివర్సిటీ ఈఈ లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్ష ఆధారంగా పంటలు వేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మట్టి పరీక్ష ఆధారంగా రైతులు పంటలు వేసుకోవాలని డివిడి ఆత్మా శ్రీలత, సీనియర్ శాస్త్రవేత్త, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తల బృందం మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని తారాపురం, పెద్ద కడబూరు గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగులో పాటించ వెలసిన సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాలు, మట్టి పరీక్ష ఆధారంగా పంట ఎంపిక కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రైతుల వద్దకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు మిరప, కంది, పత్తిలో చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు వివరించారు. ప్రభుత్వం అందించిన, అందించబోయే పథకాల గురించి మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవల గురించి, మట్టి నమూనాలు సేకరణ వాటి ప్రాముఖ్యత గురించి కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు చందన, మౌనిక, తేజ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జబీ ఉల్లా, శ్వేత, ఇందు, రైతులు పాల్గొన్నారు.

అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తూ ముందస్తు అడ్మిషన్లతో విద్యను అంగడి సరుకుగా మార్చిన నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దండుకుంటూ, పుస్తకాల దుకాణాన్ని పాఠశాలల్లోనే తెరచి పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో నారాయణ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ బాష మాట్లాడుతూ విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకలతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన తరగతులు కాకుండా నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం టెక్నో, ఒలంపియాడ్, ఈటెక్నో అని ముద్దు ముద్దు పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేసుకొని ఒక్కో గ్రూపుకు ఒక్కొక్క ఫీజు డేస్ కాలర్స్‌కి రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్లు, పుస్తకాల వ్యాపారంపై ఒక ప్రత్యేక కమిటీ వేసి విద్యాసంస్థలను తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు, విష్ణు, సహాయ కార్యదర్శి, సమీర్, నాయకులు, దస్తగిరి, హాజీ, మొహమ్మద్, హఫీజ్, ఖాజా, రమేష్, వీరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు

రేషన్ దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్న తుంబళం, నాగలాపురం, హులికన్వి గ్రామాలలోని రేషన్ దుకాణాలను మండల తహశీల్దార్ గీతా ప్రియదర్శిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ త్రాసులను, నిత్యవసర వస్తువుల నేమ్ బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా చేయాలని ఆదేశించారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఓపెన్ చేసి ఉండాలని తెలిపారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ పంపిణీ చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్: చిన్నతుంబళం గ్రామ శివారుల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తహశీల్దార్ గీతా ప్రియదర్శిని పరిశీలించారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సర్వేయర్లు, వీఆర్వోలను ఆదేశించారు. రైతులకు సమాచారం అందించి సర్వే చేయాలని సూచించారు. రీ సర్వే సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, వీఆర్వో సురేష్, మండల ఇన్ చార్జ్ సర్వేయర్ అళ్లప్ప, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని శ్రీరామ సీడ్స్, ఉరుకుంద ట్రేడర్స్, శ్రీ రామలింగేశ్వర పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ విత్తన దుకాణాలను గురువారం కోడు మూరు మండల వ్యవసాయాధికారి ఎన్ రవిప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో విక్రయిస్తున్న విత్తనాల నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, రైతులు తప్పనిసరిగా షాపు యజమాని నుంచి బిల్లు తీసుకోవాల న్నారు. ఎమ్మార్పీ ధరల కన్నా రైతులకు అధిక ధరలకు విక్రయించిన యెడల శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనం మాత్రమే ఇవ్వాలని, అదనంగా వేరే కంపెనీల విత్తనాలన్ని కట్టబెట్ట రాదని సూచించారు. మండలంలో ప్రతి, కంది, సద్దలు, ఆముదాల విత్తనాలు కావాల్సిన మేరకు అన్ని దుకాణాల్లో ఉన్నందున రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో ఎక్కడైనా లూజు పత్తి విత్తనాలు అమ్ముతుంటే, వాటిని రైతులు తీసుకోవద్దన్నారు. అలా అమ్ముతున్న వారి గురించి సమాచారం వ్యవసాయ అధికారులకు ఇవ్వవలెనని మండలంలోని రైతులను కోరారు. బిల్లు తీసుకోని రైతులకు పంట నమోదు చేయబడదని ఆయన రైతులకు తెలిపారు. మండలంలోని రైతులు విత్తనానికి అనువైన సమయం చూసి విత్తనాలు పొలాల్లో విత్తుకోవాలని తెలిపారు. ఆయా దుకాణదారులు మురళి, హనుమంతు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు

రాష్ట్రవ్యాప్త ఆందోళనలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర- వెల్దుర్తి: పేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇలా స్థలాలు ఇవ్వాలని గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని కోరుతూ జూన్ రెండో తేదీన సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాలలో ధర్నా విజయవంతం చేయాలని మండల కార్యదర్శి టి.కృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఏసన్న, టి.కృష్ణ, స్థానిక కార్యాలయంలో గురువారం ఆందోళనలకు సంబంధించిన వాల్ పోస్టర్ను విడుదల చేశారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేయాలని రైతులకు పెట్టుబడుల కింద ఇస్తామన్న 20 వేల రూపాయలు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు 90శాతం సబ్సిడీతో రైతులకు ఎరువులు విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో జూన్ 2 తేదీన ఎమ్మార్వో కార్యాలయాల ముందు జరిగే ఆందోళనలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడుమాధవస్వామి, ఆటో యూనియన్ నాయకులు కోకిల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, చిన్న వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన సిల్వర్ సెట్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల కొరకు నిర్వహించిన సిల్వర్ సెట్ విజయవంతంగా ముగిసింది. మొత్తం ఏడు పరీక్ష కేంద్రాల్లో 90శాతం విద్యార్థులు పరీక్షలు రాశారు. కర్నూలులోని జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో, ఎమ్మిగనూరులోని సేయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 94శాతం విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. కర్నూలు, ఎమ్మిగనూరులలోని పరీక్ష కేంద్రాలను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, డీన్ ఇంచార్జ్ అకాడమిక్ డాక్టర్ మొహమ్మద్ వాయిజ్ సందర్శించి పరీక్ష నిర్వహణ సమర్థవంతంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవడం జరిగింది.

కాజీపేట గ్రామంలో చోరీ

విశాలాంధ్ర - మిడుతూరు: మండల పరిధిలోని కాజీపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ హరి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు కాజీపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగ లక్ష్మమ్మ నందికొట్కూరు పట్టణంలో నివాసం ఉంటున్న కుమారుడు సుదర్శన్ రెడ్డి ఇంటికి 27వ తేదీ వెళ్ళింది. ప్రతిరోజు పొలం పనికి వస్తున్న అమర్ అనే వ్యక్తి ఉదయం ఇంటికి వెళ్లి చూడగా, ఇంటి తాళాలు పగల కొట్టిన దృశ్యాన్ని చూశాడు. ఈ విషయాన్ని ఇంటి యజమానురాలుకు ఫోన్‌లో తెలిపాడు. విషయం తెలుసుకున్న నాగ లక్ష్మమ్మ ఇంటికి చేరుకుంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగున్నర తులం బంగారు, రూ.40 వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపింది. చోరీ అయిన విషయాన్ని పోలీసులకు చేరవేయగా గ్రామానికి ఏఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

31న ఛలో సిద్దేశ్వరం

విశాలాంధ్ర - పాములపాడు : ఈ నెల 31న జరిగే చలో సిద్దేశ్వరం కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సామాజిక రాయలసీమ రాష్ట్ర సాధన సమితి అధ్యక్షుడు, సామాజికవేత్త డాక్టర్ డి.నాగన్న ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులైన జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల.అబ్రహం, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గట్టు శంకర్ గౌడ్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షుడు బి.స్వాములు, బీసీ సంఘం నాయకులు జి.సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, మండల ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు పి.అంబయ్య, రజక సంఘం మండల అధ్యక్షుడు వి.రామకృష్ణుడు, సోషల్ మీడియా ప్రతినిధి డక్కా శ్రీకాంత్‌లతో పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బీఎఎస్ఎఫ్ ఉత్పాదనలు వాలెక్సియో మిబెల్యా విడుదల

విశాలాంధ్ర - కర్నూలు: బీఎఎస్ ఎఫ్ ఇండియా తన ఆధునిక విశ్వ పంట రక్షణ పరిష్కారాల్లో రెండు రకాలు అయిన వాలెక్సియో కీటకనాకనిని మిబెల్యా శిలీంద్రనాశినిని విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో అత్యంత ముఖ్య ఆహార పంట అయిన వరి పంటకు ఇవి సేవలందిస్తాయన్నారు. ఈ రెండు వినూత్న పరిష్కారాలను ప్రవేశపెట్టడం భారతదేశపు జాతీయ ఆహార భద్రత ఎజెండాకు సహాయపడుతుందన్నారు. వరి పంటకు తీవ్ర నష్టం కలిగించే కీటకాలైన దోమ పోటును అదుపుచేయడం పొడ తెగులు లాంటి తెగుళ్ళను నియంత్రించడం ద్వారా వరి రైతులు తమ పంట దిగుబడులను పెంచుకోవడానికి ఈ పరిష్కారాలు సహాయపడతాయని తెలిపారు. సైమన్ బర్గ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బీఎఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ ఆసియా-పసిఫిక్ మాట్లాడుతూ వరిపంట వ్యవస్థకు మా దీర్ఘకాలిక నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తాము దీనిని మొట్టమొదటగా భారతదేశంలో ప్రారంభిస్తున్నందుకు చాలా ఉత్సాహంగా ఉన్నామన్నారు. వరి రైతులకు వాళ్ళ పొలాల్లో కీటకాలను అదుపు చేసేందుకు సహాయపడే కొత్త కెమిస్ట్రీ అవసరమనే విషయం మేము తెలుసుకున్నామన్నారు. క్రియాశీల పదార్థంలో మార్కెట్ ప్రమాణాలకు తెలిసిన క్రాస్ రెసిస్టెన్స్ లేదన్నారు. అధిక వేరు వ్యవస్థ మరియు వెడల్పాటి జెండా ఆకులను చూపించాయని దీనివల్ల ఎక్కువ మొక్కలు రక్షించబడి రైతులకు అధిక దిగుబడులు అందిస్తాయని తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 30, మే 2025

సామాన్య కార్యకర్తగా మంత్రి ఫరూఖ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల నియోజకవర్గం నుంచి మహానాడుకు దాదాపు 10 వేల మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేసిన మంత్రి ఫరూఖ్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతి రెడ్డి తులసిరెడ్డి, మంత్రి తనయులు ఎన్ఎండి ఫిరోజ్, ఫయాజ్. నంద్యాల టెక్కే మార్కెట్ యార్డ్ నందు 5 వేల మందికి టీడీపీ సీనియర్ నాయకులు మిద్దె చిన్న హుస్సేని అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. చివరి రోజు మహానాడుకు వెళ్తున్న కార్యకర్తలకు అల్పాహారాన్ని స్వయంగా తన చేతులతో మంత్రి ఫరూఖ్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతి రెడ్డి తులసి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ లు వడ్డించారు. నంద్యాల ఎమ్మెల్యే, ప్రస్తుత న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూఖ్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీల నాయకుడిగా ఉంటూ ఎన్నో ఉన్నత పదవులను అలంకరించినా ఆయనలో ఎలాంటి గర్వం అనేది లేకుండా నంద్యాల మార్కెట్ యార్డ్ నందు ఒక సామాన్య కార్యకర్తగా చివరి రోజు మహానాడుకు వెళ్తున్న కార్యకర్తలు,నేతల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతూ కనిపించడం చర్చనీయాంశం. సామాన్య కార్యకర్త లాగానే తను కూడా కార్యకర్తలతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. అల్పాహార అనంతరం మహానాడుకు వెళ్తున్న వాహనాలకు జెండా ఊపి మంత్రి ఫరూఖ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్ తో పాటు మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతి రెడ్డి తులసి రెడ్డి,టీడిపి మండల ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప,టీడిపి సీనియర్ నాయకులు,కార్యకర్తలు, నందమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు
అవస్థలు ఎన్నెన్నో

విశాలాంధ్ర - కర్నూలు : ఆదార్ కార్డులో తప్పుగా పడిన పుట్టిన తేదీని, పేర్లను సరి చేసుకోవాలంటే పడే తిప్పలు అన్నీ, ఇన్నీ కావు. వారి తిప్పలు వర్ణణాతీతం. ఆధార్ కార్డులో మొదట్లో నమోదు చేసినప్పుడే దొర్లిన తప్పులు ఎన్నో.. కోకొల్లలు అని చెప్పొచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలు ఆధార్ కార్డును నమోదు చేయించేటప్పుడు వారికి సరైన అవగాహన లేకపోవడంతో చాలా వరకు తప్పులు దొర్లుతుంటాయి. ఓ వ్యక్తి ఆధార్‌లో తప్పుగా పడిన తన పేరును, లేదా వయస్సును మార్చుకోవాలంటే ప్రమాణీకంగా పదో తరగతి మార్కుల జాబితాను తీసుకుంటారు. మరి చదువుకోని వారి పరిస్థితేంటి.. ఒక వేళ పదో తరగతి చదివి ఉంటే 1995 ముందు మార్కుల లిస్టులో సంబంధిత వ్యక్తి పోటో ఉండేది కాదు. ప్రస్తుతం వారు తమ ఆదార్‌కార్డులో తప్పుగా పడిన పుట్టిన రోజును, లేదా పుట్టిన తేదీని మార్పు చేసుకోవాలంటే పదో తరగతి మార్కుల లిస్టు ఆదారంగా అందులో ఉన్న ఫోటోతో సరిచూసి ఆదార్ కేంద్రం వారు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. మార్కుల జాబితాపై కచ్చితంగా ఫోటో ఉండాలని, లేకపోతే మేమేమి చేయలేమంటూ ఆధార్ సెంటర్ వారు సూచిస్తున్నారు. దీంతో 1995 కంటే ముందు పదో తరగతి అభ్యసించిన వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వారు ఆదార్‌కార్డులో పుట్టన తేదీని మార్పు చేసుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువుకునే వారిని ఇటీవల ఆపార్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. అందులో ప్రతి విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లతో సహా ప్రతి ఒక్కటి సరియైన విధంగా ఉంటేనే నమోదు ఆపార్‌లో నమోదు అవుతుంది. లేకపోతే ఆపార్‌లో వారి నమోదును తిరస్కరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువురాని తల్లిదండ్రులు ఏదో వారికి గుర్తున్న విధంగా వయస్సు, పేర్లను చెప్పి పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తీరా పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లో ఓ విధంగా, తల్లిదండ్రుల ఆధార్ కార్డులో ఇంటి పేరు మరో విధంగా ఉంటుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆధార్‌లలో ఒకే విధంగా సరియైన రీతిలో మార్చుకునేందుకు చదువురాని తల్లిదండ్రులు పడ్డ కష్టాలు వర్ణణాతీతం. దీనిపై అధికారులు దృష్టిసారించి ఆధార్‌లో మార్పులు, చేర్పులను సులభతరం చేయాలని పలువురు కోరుతున్నారు.

మోహన్ తేజ్‌కు అభినందనలు తెలిపిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి బంగారు పతకం గెలుచుకున్న కోవెలకుంట్లకు చెందిన మోహన్ తేజకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపినట్లు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ బాక్సింగ్ ఛాంపియన్ మోహన్ తేజ జర్నలిస్ట్ మిత్రుడు రమణ కుమారుడని తెలిసి ఎంతో సంతోషం కలిగిందన్నారు. మోహన్ తేజ భవిష్యత్తులో మరింత కష్టపడి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

రేపే పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ మండలంలోని పింఛన్ దారులకు రేపు శనివారమే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెల ఒకటో తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే సచివాలయ సిబ్బందిశనివారం ఉదయం 7 గంటలకు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పింఛన్లు అందజేస్తారని ఆయన అన్నారు..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - చాగలమర్రి: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మాస్టర్ ట్రైనర్స్ పంచాయతిరాజ్ ఏఈ కొండారెడ్డి, తేజస్వినీ, విష్ణుప్రియలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయాల సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ యోగాశనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులు బాబు,జూనియర్ సహాయకులు బషీర్,ఎంసీఓ రాజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ యోగ చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో ట్రైనర్స్ రేపల్లె ప్రభావతి, అనూష, గీతా, బీసమ్మ, రాజ్ కుమార్‌లు యోగేంద్ర కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ 11వ యోగ దినోత్సవాని పురస్కరించు కొని యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగ చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక శారీరక ఉల్లాసం లభిస్తుందని ఆయన అన్నారు. యోగ చేయడం వల్ల శ్వాస నియంత్రణ ధ్యానం మన శారీరక మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సు ను మెరుగుపరుస్తాయని, క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మంచి ఫలితాలు పొంద వచ్చునని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పాములపాడు : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం ప్రిన్సిపల్ నాగ రవీంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు యోగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద అధికారి సావిత్రి మరియు యోగా శిక్షణ నిర్వహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడితూ యోగ ఆయుర్వేదం అనేటివి పూర్వకాలం నుండి మన భారతదేశంలో ప్రజలు ఉపయోగిస్తున్నారని యోగ వలన ఆరోగ్యంతో పాటు శరీర ధారుఢ్యం మానసిక వికాసం,రోగ నిరోధక శక్తి కలుగుతాయని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు యోగా అబ్యాసాన్ని అలవర్చుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం యోగా శిక్షకులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

విశాలాంధ్ర - బనగానపల్లె: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులకు యోగపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అధికారులు ప్రజలతో మమేకమై పెద్ద ఎత్తున యోగ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. యోగా తిరుమలయ్య అధికారులకు యోగపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్న తుంబళం, నాగలాపురం, హులి కన్వి గ్రామాలలోని రేషన్ దుకా ణాలను మండల తహశీల్దార్ గీతా ప్రియదర్శిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ త్రాసులను, నిత్యవసర వస్తువుల నేమ్ బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా చేయాలని ఆదేశించారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఓపెన్ చేసి ఉండాలని తెలిపారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచిం చారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్: చిన్నతుంబళం గ్రామ శివారుల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తహశీల్దార్ గీతా ప్రియదర్శిని పరిశీలించారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సర్వేయర్లు, వీఆర్వోలను ఆదేశించారు. రైతులకు సమాచారం అందించి సర్వే చేయాలని సూచించారు. రీ సర్వే సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, వీఆర్వో సురేష్, మండల ఇన్ చార్జ్ సర్వేయర్ అళ్లప్ప, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - తుగ్గలి: మండలంలోని గ్రామాల నుండి గురువారము టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కెఈ శ్యాం కుమార్ ఆధ్వర్యంలో తమంత కడపలో జరుగుతున్న టిడిపి మహానాడుకు తరలి వెళ్లామని తెలిపారు. కడపలో ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబుతో కలిసి మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు.

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాల నుండి టిడిపి శ్రేణులు కడపలో నిర్వహిస్తున్న మూడవరోజు మహానాడు బహిరంగ సభకు గురువారం భారీగా తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో టిడిపి అభిమానులు కార్యకర్తలు వెళ్లారు. మండల వ్యాప్తంగా కార్యకర్తలు అభిమానులు కోసం ఏర్పాటు చేసిన 40 ఆర్టిసి, ప్రవేట్ బస్సులతో పాటు 200 కార్లు, స్కార్పియోలలో వెళ్లారు. టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు నంద్యాల ప్రసాద్, కలవటాల సర్పంచ్ కృష్ణ రంగారెడ్డి, మండల కోఆర్డినేటర్ కోటపాడు శివరామిరెడ్డి, యువ నాయకులు గొంగటి చంద్రశేఖర్ రెడ్డి,వాల్మీకి నాయకులు ఉలవల నరసింహులు, యువనేత వివేకానంద రెడ్డి, అందే రాము, గూలి నాగేశ్వర్ రెడ్డి, ఎర్రగుడి దస్తగిరి, ఇటిక్యాల శివారెడ్డి, గోపాల్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : కడప వేదికగా జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి టిడిపి రైతు సంఘం నాయకులు టప్పల్ అశ్రఫ్ అలీ ఆధ్వర్యంలో రైతు సంఘం బృందంతో కలిసి వెళ్లడం జరిగింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి సుమారు 80 బస్సులు ప్రైవేటు వాహనాల్లో సుమారు 5 వేల మంది వెళ్లినట్టు తెలిసింది.

విశాలాంధ్ర - బనగానపల్లె: కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు 2025 బహిరంగ సభకు గురువారం నాడు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపు మేరకు బనగానపల్లె మండలం నుంచి వేలాదిగా టిడిపి నాయకులు కార్యకర్తలు వాహనాల్లో కడపకు బయలుదేరి వెళ్లడం జరిగింది.

విశాలాంధ్ర- అవుకు: టీడీపీ ప్రతిష్టాత్మకంగా కడపలో చేపట్టిన మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రామాపురం నుండి ఎంపీటీసీ ఎస్ రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం నాయకులు మారం పుల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. దాదాపుగా 20 వాహనాలలో 200 మంది నాయకులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి తరలి వెళ్ళిన వారిలో ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సేషి రెడ్డి తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : కడపలో మూడు రోజులుగా జరుగుతున్న మహానాడుకు మండలం నుండి టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉప్పెనల గురువారం తరలి వెళ్లారు. ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా తరలి వెళ్లారు. పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎంఎస్ అన్సర్ బాష ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు వందలాదిమంది మహానాడుకు తరలి వెళ్లారు.

31న ఛలో సిద్దేశ్వరం

విశాలాంధ్ర - పాములపాడు : ఈ నెల-31న జరిగే చలో సిద్దేశ్వరం కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సామాజిక రాయలసీమ రాష్ట్ర సాధన సమితి అధ్యక్షుడు, సామాజికవేత్త డాక్టర్ డి.నాగన్న ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులైన జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల.అబ్రహం, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గట్టు శంకర్ గౌడ్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షుడు బి.స్వాములు, బీసీ సంఘం నాయకులు జి.సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, మండల ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు పి.అంబయ్య, రజక సంఘం మండల అధ్యక్షుడు వి.రామకృష్ణుడు, సోషల్ మీడియా ప్రతినిధి డక్కా.శ్రీకాంత్ లతో పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.నాగన్న మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్ వద్ద పెద్ద గోతి పడినా, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా,అలగనూరు రిజర్వాయర్ తెగిపోయినా, గోరుకల్లు రిజర్వాయర్ కట్టలు కుంగిపోయినా, తుంగభద్ర ప్రాజెక్టుల గేట్లకు భద్రత లేకున్నా వాటి పటిష్ట భద్రతకై నేటి వరకు పాలకులలో ఏ మాత్రం చలనం లేదని తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9వ వార్షికోత్సవం నిర్వహించడం జరుగు తుందన్నారు. రాయలసీమలోని అనేక ప్రాజెక్టుల ప్రధాన కాలువల, ఉపకాలువల, పంట కాలువల, డిస్ట్రిబ్యూటరీల రూపురేఖలే లేకుండా ఛిద్రమై పోయాయన్నారు. ప్రపంచ వారసత్వం సాగునీటి ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన కేసీ కెనాల్ ఆయకట్టుకు

నీరు ఎంతవరకు ఇస్తారో భరోసా ఇచ్చే పరిస్థితులు లేకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎనిమిది దశాబ్దాల కిందట నిర్మాణం అయిన తుంగభద్ర ఎగువ కాలువ, తుంగభద్ర దిగువ కాలువల కింద హక్కుగా ఉన్న 4.36 లక్షల ఎకరాల ఆయకట్టు భూమిలో కేవలం 1.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నేటికీ నీరు లభిస్తుండడం రాయలసీమ పట్ల పాలకుల వివక్షతకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టు ముందు భాగం వద్ద గోయ్యి పడిన, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకపోయినా, అలగనూరు రిజర్వాయర్ దిగిపోయిన, గోర్కల్లు రిజర్వాయరుకు కట్టలు కుంగిపోయిన, తుంగభద్ర డ్యామ్ గేట్లు కు భద్రత లేకున్నా పట్టి పట్టిష్ట భద్రతకు పాలకులు నీటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా నాలుగు దశాబ్దాల కింద నిర్మాణం మొదలైన తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యం వలన ఇంకా మూడు దశాబ్దాలైనా పూర్తి అయ్యే పరిస్థితులు లేకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలోని అనేక చెరువుల తూముల, అలుగుల కట్టల అధోగతి పాలైనా వాటి మరమ్మత్తులకు నిధుల మంజూరుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేసిన పాలకులు నిర్మాణాలను ఎందుకు కొనసాగించడం లేదని అయన ప్రశ్నించారు. హామీలు ఇచ్చిన సిద్దేశ్వరం అలుగు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్ తదితర అంశాలపై పాలకులు కేవలం ప్రకటనలకే పరిమితమైనారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. పదకొండేళ్ళ నుంచి ప్రత్యేక ప్యాకేజి నిధులను అడగకుండా మౌనంగా వున్న పాలకులు ఆ నిధులను గోదావరి - భానకచర్ల అనుసంధానమనీ చెప్పి రాయలసీమ వాసులను మభ్యపెడుతున్నారన్నారు.

పాలకులపై ఒత్తిడి తెద్దాం : ప్రతి గడప నుంచి సిద్దేశ్వరానికి కదులుదాం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధన ఉద్యమంలో భాగస్వామ్యులవుదాం అని, ఈ నెల 31న సంగమేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగసభ విజయవంతానికై ప్రజలు వేలాదిగా తరలిరావాలని డాక్టర్ డి.నాగన్న ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ మణిరాజ్ బేటి పుల్లయ్య, బక్కన్న, యేసు, సామేలు, చౌదయ్య, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్లో రైతులకు మేలు రకమైన విత్తనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: ఖరీఫ్ సీజన్లో రైతులకు మేలు రకమైన మొక్కజొన్న, పత్తి, మినుము,కంది, ఉల్లి, మిరప,వరి, విత్తనాలను పూర్తి సబ్సిడీతో అందించాలనీ సీపీఐ (ఎమ్మెల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక ఏడిఏ కార్యాలయం ముందర ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా అనంతరం ఏఏఓ టెక్నికల్ అసిస్టెంట్ డి.కలిమ్మున్నాకు ఏఈఓ పార్వతికి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగినది. అనంతరం ధర్నాను ఉద్దేశించి పిక్కిలి వెంకటేశ్వర్లు ఎంసిపియుఐ జిల్లా కన్వీనర్ పాతకోట లాజరస్ మాట్లాడుతూ 2025 సీజన్ ముందుగానే ఈ సంవత్సరం మొదలవుతుందని రైతులకు మేలు రకమైన విత్తనాలు ఎరువులు రైతులకు కౌలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని కల్తీ విత్తనాలను తయారు చేస్తున్న కంపెనీ యజమానుల పైన ఉక్కుపాదం మోపాలని నంద్యాల ప్రాంతంలో నకిలీ విత్తనాలకు అడ్డగా ఏర్పడిందని అలాంటి వారి పైన నకిలీ జన్మినేషన్ రాక పంట దిగుబడి రాక అలాంటి విత్తనాలను తయారు చేస్తున్న కంపెనీ వారి పైన చట్టపరమైన చర్య తీసుకొ వాలన్నారు. గత సంవత్సరంలో మొక్కజొన్న పత్తి మిరప మినుము తదితర పంటలు దెబ్బతిన్నాయని దీని వలన రైతులు కోలుకోలేని స్థితిలో అప్పులు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులందరికీ కౌలు రైతులకు బ్యాంకు ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేసి రైతుల బకాయి రుణాలను రీ షెడ్యూలు చేయాలన్నారు. కౌలు రైతులకు సీజన్ మొదలవుతున్న నేటికిని సిఎల్ఆర్ కౌంటర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదన్నారు తక్షణమే మంజూరు చేసి కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరుగులను బ్యాంకు రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్సిపిఐయు జిల్లా నాయకులు మద్రి స్వామి మహిళా సంఘం నాయకురాల్లో ఎస్ బి బి, లక్ష్మీదేవి ,ముత్తు జాబి, రైతు నాయకులు టీ నరసింహులు, సోమప్ప, బాష పాల్గొన్నారు.

మహానడుకు బయలుదేరిన నాయకులు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : కడపలో టీడీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆదేశాలతోమండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా అధిక సంఖ్యలో వాహనాల్లో కడపలో నిర్వహించే మహానాడుకు తరలి వెళ్లారు. లింగాపురం గ్రామం నుండి శివకృష్ణారెడ్డి, బుర్రు భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, గుండెపోగు అశోక్, గుండెపోగు అభిలు మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరారు.



విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కడపలో జరుగుతున్న మహానాడు భారీ సభకు ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు తరలి వెళ్లారు. ఆళ్లగడ్డ మండల టిడిపి కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి కడపకు వెళుతూ మాట్లాడారు. ఆళ్లగడ్డ మండలం నుంచి 3000 మంది తరలి వెళ్తున్నట్టు తెలిపారు. పట్టణం నుంచి 1500 మంది, మండలంలోని గ్రామాల నుంచి 1500 మంది 80 బస్సులు, వాహనాల ద్వారా వెళ్తున్నామన్నారు. బాచేపల్లి గ్రామం నుంచి 4 బస్సులు, మూడు కార్లలో దాదాపు 300 మంది వెళ్తున్నామన్నారు.

మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో మహానాడుకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కడప గడపలో నిర్వహించిన మూడు రోజుల మహానాడు కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖమంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఆదేశాలతో మూడవ రోజు మహానాడు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కౌన్సిలర్లు ఖండే శ్యాంసుందర్ లాల్, నాగార్జున, శ్రీదేవి, జైనబీతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల ఇన్చార్జిలు, టీడీపీ నాయకులు, గోస్పాడు మండల నాయకుల ఆధ్వ ర్యంలో దాదాపు 150 బస్సులతో పాటు వివిధ వాహనాలలో కడపకు తరలి వెళ్లారు. టెక్కే మార్కెట్ యార్డులో కడపకు వెళ్తున్న నాయకులకు, కార్యకర్తలకు మాజీ కౌన్సిలర్ మిద్దె హుసేని టిఫిన్ అరేంజ్ చేశారు. టిఫిన్ చేసుకున్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనాలతో దీబగుంట్ల మెట్ట అందరూ కలసి భారీ కాన్వాయ్ తో కడప బహిరంగ సభకు చేరుకున్నారు.

కార్డుదారులకు ఇబ్బందులు రానివ్వొద్దు

విశాలాంధ్ర - నందవరం: రేషన్ డీలర్లు కార్డుదారులకు ఇబ్బంది రాని వ్వదని తహ శీల్దార్ కె.శ్రీని వాసులు అన్నారు. గురు వారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లకు జూన్ నెలకు సంబందించి కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ విషయంలో ఇబ్బందులు రాకుండా చేసుకోవాలని, రేషన్ షాపులో సదుపాయాలపై డీలర్ లకు కీలక సూచనలు చేశారు. ప్రతి డీలర్ ఉదయం 8 నుండి 12 వరకు, సాయంత్రం 4 నుండి 8 వరకు కచ్చితంగా రేషన్ షాపును డీలర్లు తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులకు కచ్చితంగా ఇంటి వద్దకే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటిలు శశిధర్, మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.